

121 డివిజన్ వడ్డేపల్లి ఎన్‌క్లేవ్ ఎదురుగా రోడ్డుపై ఉన్న చెత్తను తొలగించిన మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది

రోడ్లపై చెత్త వేస్తే జరిమానా

● మున్సిపల్ శానిటేషన్ డీఈ శ్రీనివాసరావు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కూకట్‌పల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి డివిజన్ పరిధిలో రోడ్లపైన ఎక్కడ చెత్త వేసినా వారిపై జరిమానాలు విధిస్తామని శానిటేషన్ డీఈ శ్రీనివాసరావు అన్నారు. చెత్త తీయరూ అంటూ 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి స్పందించిన మున్సిపల్ అధికారులు స్పందించారు. బుధవారం ఉదయమే వడ్డేపల్లి ఎన్‌క్లేవ్ ఎదురుగా నాలాపైన ఉన్న చెత్తను పూర్తిగా శుభ్రం చేశారు. కూకట్‌పల్లి పరిధిలో ఎక్కడైన రోడ్లపై, నాలా సమీపంలో చెత్త వేయరాదని ప్రజలకు సూచించారు. ఎవరు అతిక్రమిస్తే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన

అల్లాపూర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీ వివేకానందనగర్ కాలనీలో కాంగ్రెస్ నేత మస్తాన్ రెడ్డి దగ్గరుండి ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారుల సర్వే జరిపించేలా చూస్తున్నారు. తమ ప్రభుత్వంలో అర్హులు అందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చేందుకే ప్రతీ డివిజన్‌లో నమోదు ప్రక్రియ పునఃప్రారంభించారని అన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో పేర్లను నమోదు చేసుకోలేకపోయిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని కూకట్‌పల్లి కాంగ్రెస్ బీ-బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు ఓ ప్రకటనలో సూచించారు.



వివేకానందనగర్, అల్లాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలిస్తున్న కాంగ్రెస్ నేత మస్తాన్‌రెడ్డి



జాబ్‌మేళాలో ప్రిన్సిపాల్ డా.అలివేలు మంగమ్మ తదితరులు

జాబ్‌మేళాలో 126 మంది విద్యార్థుల ఎంపిక

కేపీహెచ్‌బీకాలనీ, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులను ప్రిన్సిపాల్ డా.అలివేలు మంగమ్మ కోరారు. ఈ మేరకు కూకట్‌పల్లిప్రభుత్వ డిగ్రీకళాశాలలో టీఎస్‌కేసీఆధ్వర్యంలో బుధవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఇందులో 378మంది విద్యార్థులు ఉద్యోగాల కోసం పేర్లు నమోదు చేసుకోగా 126 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ డా.కే.శ్రీనివాసరావు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.కే.కరుణాకర్ పాల్గొన్నారు.



కాలభైరవస్వామి ఆలయంలో అమావాస్య పూజలు చేసిన కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి దంపతులతో బీఆర్ఎస్ నాయకులు

అమావాస్య పూజలు

బాలానగర్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మౌని అమావాస్య సందర్భంగా బాలానగర్ వినాయకనగర్‌లో ఉన్న కాలభైరవస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హిందూ మత విశ్వాసాల ప్రకారం అమావాస్య రోజున చేసే పూజలు మంచి ఫలితాలను ఇస్తాయని, ఇందులో మౌని అమావాస్యకు మరింత విశిష్టత ఉన్నదన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి స్వామివారికి గుమ్మకాయ దీపాలు, పూజలను నిర్వహించారు. ఈ పూజల్లో స్థానిక కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి, కుటుంబ సభ్యులు బీఆర్ఎస్ నాయకులతో కలిసి పూజలు చేసి దీపాలు వెలించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు కార్పొరేటర్‌కు, బీఆర్ఎస్ నాయకులకు, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు, పద్మశ్రీ మంద కృష్ణమాదిగ

మాదిగ ఉపకులాలకు అండగా ఉంటా: మందకృష్ణ

వనస్థలిపురం, జనవరి 29(ఆంధ్ర జ్యోతి): మాదిగ ఉపకులాలకు అండగా ఉంటూ.. వారికి ఏ కష్టం వచ్చినా తోడ్పాటును అందిస్తానని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మంద కృష్ణమాదిగ అన్నారు. బుధవారం ఎల్బీనగర్‌లోని సితార హోటల్‌లో ఎస్సీ వర్గీకరణపై మాదిగ ఉపకులాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంద కృష్ణమాదిగ మాట్లాడుతూ ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించే లక్షడప్పులు.. వెయ్యిగొంతుకలు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వంద ఏళ్ల క్రితం బీఆర్ అంబేడ్కర్ చెప్పిన విధంగానే జనాభా ప్రాతిపాదికన రిజర్వేషన్లు ఏర్పడ్డాయన్నారు. మాదిగ కులంలోని 57 కులాలు కలిస్తేనే 15శాతం రిజర్వేషన్ అమలు అవుతుందన్నారు. ప్రతి రెండు కులాల మధ్య సమానత్వం లేకపోవడమే వెనకబాటుకు కారణమని, ప్రతి ఒక్కరికి ఆశయం గొప్పగా ఉండాలని, అత్యాశ ఉండవద్దని హితువు పలికారు. అన్ని రాష్ట్రాల్లో రిజర్వేషన్లు ఒకే విధంగా లేవని, రిజర్వేషన్ల మూలంగా మాదిగలు నష్టపోయి, మాలలు లాభ పడ్డారన్నారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్, నేటి తెలంగాణ రాష్ట్రంలో మాదిగల జనాభా ఎక్కువగా ఉన్నప్పటికీ 59 ఉపకులాల్లో మాలలే ఎక్కువగా బాగుపడ్డారని తెలిపారు. ఆనాడే మాలలకు ఎస్సీ షెడ్యూల కులాల నుంచి తొలగించాలని ప్రతిపాదనలు వచ్చాయని ఆయన గుర్తుచేశారు. అదేవిధంగా రామ్ చందర్‌రాజ్ కమిషన్ రిపోర్ట్ తెలిపిన విధంగా 6శాతం ఉన్న మాలలు 15శాతం రిజర్వేషన్ పొందారని, 9శాతం ఉన్న మాదిగలు 6శాతం రిజర్వేషన్లు పొందారన్నారు. మాలలతో మాదిగలను పోల్చితే ఇతర ఉపకులాలకు తాను అండగా ఉండలేమని ఆయన తేల్చిచెప్పారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్యమాదిగ, ఇతర ఉప కులాల అధ్యక్షులు తూర్పాటి హన్మంతు, చింతల రాజలింగం, రాజమౌళి, నర్సింహ, గౌరిశంకర్, ప్రొ.ఈశ్వర్, మంగేష్, కృష్ణ, సాలమ్మ పాల్గొన్నారు.

పగలూ వీధిదీపాల వెలుగులు

● పనిచేయని టైమర్లు
● మరికొన్నిచోట్ల వెలగని వీధిదీపాలు
● అంధకారంలో కాలనీవాసులు

కూకట్‌పల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పగలు.. రాత్రి అన్నతేడా లేకుండా కొన్ని చోట్ల వీధిదీపాలు వెలుగుతూనే ఉన్నాయి. తెల్లారుజామున ఆగిపోవాల్సిన వీధిదీపాలు ఆరడం లేదు. మరికొన్ని కాలనీల్లో వీధిదీపాలు అసలు వెలగడమే లేదు. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని పలు డివిజన్‌లలో ఇదే పరిస్థితి నెలకొంది. కూకట్‌పల్లి డివిజన్ పరిధిలో పలు కాలనీల్లో నెల రోజులుగా పట్టపగలే వీధిదీపాలు వెలుగుతున్నాయి. అయినా వీటి గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. మున్సిపాలిటీ అధికారులు మాత్రం అసలు ఏం పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. వీధిదీపాల గురించి పట్టించుకునే అధికారులే లేరని పలువురు కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కూకట్‌పల్లి డివిజన్ పరిధిలో..

కూకట్‌పల్లి డివిజన్ ప్రశాంత్‌నగర్, దయర్‌బస్తి, సంగీత్‌నగర్‌తో పాటు కాలనీల్లో నెల రోజులుగా పగలు సమయంలోనూ వీధిదీపాలు వెలుగుతూనే ఉన్నాయి. ప్రశాంత్‌నగర్‌లోని కొన్ని కాలనీల్లో సుమారు 20 వరకు వీధిదీపాలు వెలగడం లేదు. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకుపోయినా ఫలితం ఉండడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. కూకట్‌పల్లి 121 డివిజన్ పరిధిలోనే వీధిదీపాలకు సంబంధించి 150కి పైగా జంక్షన్ బాక్స్‌లున్నాయి. మరోవైపు వీధిదీపాలకు సంబంధించిన టైమర్‌లు కూడా చెయిపోయాయి. ఫలితంగా జంక్షన్ బాక్స్‌ల వద్దకు వెళ్లి ఆన్ ఆఫ్ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. కానీ ఉదయమైనా వీధి దీపాలను ఎవరూ ఆఫ్ చేయకపోవడంతో వీధిదీపాలు పగలు సైతం వెలుగులు విరజిమ్ముతున్నాయి.



కూకట్‌పల్లి డివిజన్ ప్రశాంత్‌నగర్‌లో పట్టపగలే వెలుగుతున్న వీధిదీపాలు

సమస్య పరిష్కరిస్తాం

కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని వీధిదీపాలకు సంబంధించిన టైమర్‌లు చెడిపోయాయి. స్విచ్‌లు సిబ్బంది చేత ఆన్, ఆఫ్ చేయాల్సిన పరిస్థితి నెలకుంది. కొద్దిరోజులుగా కాంట్రాక్ట్ తీసుకున్న కార్మికులకు జీతాలు రాకపోవడంతో సమస్య నెలకుంది. సమస్యను డీఈకి వివరించాం. త్వరలోనే సమస్య శాశ్వతంగా పరిష్కరిస్తాం.

- భద్రయ్య, 121 డివిజన్ ఎలక్ట్రిసిటి అధికారి

కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు



కేపీహెచ్‌బీకాలనీ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు ఇలా ఉన్నాయి. టమోట రూ.13, వంకాయ రూ.28, బెండకాయ రూ.40, పచ్చిమిర్చి రూ.45, బజ్జిమిర్చి రూ.28, కాకరకాయ రూ.38, బీరకాయ రూ.45, క్యాబేజీ రూ.13, బీన్స్ రూ.45, క్యారెట్ రూ.23, గోబిపువ్వు రూ.30, దొండకాయ రూ.45, చిక్కుడుకాయ రూ.45, గోరుచిక్కుడు రూ.28, బీట్‌రూట్ రూ.23, క్యాప్సికమ్ రూ.40, ఆలుగడ్డ రూ.28, కీర రూ.28, దోసకాయ రూ.18, సొరకాయ రూ.20, పొట్లకాయ రూ.20, కంద రూ.65, ఉల్లిపొరక రూ.40, ఉల్లిగడ్డ రూ.39, మామిడికాయ రూ.15-20, అరటికాయ రూ.8-9, చామగడ్డ రూ.40, ముల్లంగి రూ.4-5, చిలగడ దుంప రూ.35, గుమ్మడికాయ రూ.30, నిమ్మకాయలు రూ.30-40, మునగకాయలు రూ.10-12, పచ్చిబఠాణి రూ.45, బొప్పాయి రూ.40, పుట్టగొడుగులు రూ.40, ఎండుమిర్చి రూ.200, అల్లం రూ.80, వెల్లుల్లి రూ.280, చింతపండు రూ.140, పండుమిర్చి రూ.80, ఉసిరి రూ.50, కరివేపాకు రూ.80, పర్వల్ రూ.55, పల్లికాయ రూ.65, లోబా రూ.25, ఆకాకరకాయ రూ.60. పైన పేర్కొన్న ధరలు ఈరోజు ఉదయం 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ప్రజలందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తాం

కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్

బాలానగర్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పేద ప్రజలందరికి ప్రభుత్వ పథకాలు అందేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. ఇందిరమ్మ ఇళ్ళ సర్వే విషయమై ఆయన బాలానగర్ పార్టీ కార్యాలయంలో ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న కొందరి వివరాలను అధికారులు, సిబ్బంది పూర్తి స్థాయిలో కంప్యూటర్‌లో అప్‌లోడ్ చేయలేదన్నారు. దీని కారణంగా జాబితాలో పేర్లు కనపడకపోవడంతో దరఖాస్తుదారుల్లో ఆందోళన నెలకొన్నదన్నారు. ఈ విషయమై మంగళవారం మూసాపేట్ సర్కిల్ అధికారులతో సమావేశమయ్యామని పూర్తి వివరాలను, డివిజన్ల వారీగా సిబ్బంది వివరాలను అధికారులు తనకు వివరించారని అన్నారు. కేపీహెచ్‌బీ(శైలజ), బాలాజీనగర్(నాగరాజు), అల్లాపూర్ (గిరిధర్), మూసాపేట్(భిక్షపతి), ఫతేనగర్(రియాజొద్దీన్) సిబ్బందిని నియమించామని, దరఖాస్తుదారులు డివిజన్ల వారీగా నియమితులైన సిబ్బందిని కలిసి పూర్తి వివరాలు తెలుసుకోవాలని బండి రమేష్ స్పష్టం చేశారు.



కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్



శివస్వాముల పడిపూజ

కేపీహెచ్‌బీ రోడ్డు నంబర్-3లోని కామాక్షి సమేత ఏకాంబరేశ్వర స్వామి ఆలయంలో వెంకటేశ్వరరెడ్డి గురుస్వామి ఆధ్వర్యంలో బుధవారం పడిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాధవరం కాంతరావు హాజరై శివయ్యను దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కే.శ్రీనివాస్, వినోద్, శేఖర్, సూరిబాబు, వేణుగోపాల్, సన్నీ తదితరులు పాల్గొన్నారు. - కేపీహెచ్‌బీకాలనీ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి)

రోడ్డుపై ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్..

అదుపు తప్పి పడిపోయిన వాహనదారులు

● డీసీఎంను అదుపులోకి తీసుకుని డ్రైవర్‌పై కేసు నమోదు చేసిన బాలానగర్ పోలీసులు

బాలానగర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌ఫార్మర్ల లోడుతో వెళుతున్న డీఎంసీ నుంచి ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్(ఇన్సులేటింగ్ ఆయిల్) లీకై రోడ్డుపై పడింది. ఆయిల్ జారుడు స్వభావాన్ని కల్గి ఉండడంతో రోడ్డుపై వెళుతున్న వాహనదారులు అదుపు తప్పి, జారి కిందపడ్డారు. ఐడీపీఎల్ చౌరస్తా నుంచి బాలానగర్ వెళ్లే దారిలో బుధవారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. ఇలా జరగడానికి డీసీఎం నుంచి లీకవుతున్న ఇన్సులేటింగ్ ఆయిల్ కారణమని, ఇందుకు డీసీఎం డ్రైవర్ నిర్లక్ష్యమేనని గుర్తించిన వాహనదారులు బాలానగర్ ట్రాఫిక్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని చేరున్న బాలానగర్ ట్రాఫిక్ సీఐ సురేశ్‌కుమార్ ప్రమాదానికి కారణమైన డీసీఎం సమాచారాన్ని బాలానగర్ పోలీసులకు అందించారు. రోడ్డుపై వెళుతున్న వాహనదారులు అదుపుతప్పి రోడ్డుపై పడకుండా ఉండేందుకు ట్రాఫిక్ సీఐ జీహెచ్‌ఎంసీ సిబ్బందితో రోడ్డుపై డస్ట్, మట్టిని పోయించి ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ సీఐ ఇచ్చిన సమాచారంతో డీసీఎంను, డీసీఎం డ్రైవరును అదుపులోకి తీసుకున్నారు. అదుపు తప్పి స్వల్ప గాయాలపాలైన సనత్‌నగర్‌కు చెందిన రాజేశ్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న బాలానగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. జీడిమెట్ల నుంచి ఎర్రగడ్డకు ట్రాన్స్‌ఫార్మర్ల లోడ్‌తో వెళుతున్నానని, బ్రేకు వేసినప్పుడు డీసీఎంలోని ట్రాన్స్‌ఫార్మర్లు ఒక దానికొకటి తగులుకోవడం వల్లే అయిల్ లీకైందని డ్రైవర్ పోలీసులకు వివరించారు.



వాహనదారులు జారి పడకుండా రోడ్డుపై డస్ట్, ఇసుక పోయిస్తున్న బాలానగర్ ట్రాఫిక్ పోలీసులు

రోడ్డు భద్రతపై అవగాహన

కేపీహెచ్‌బీకాలనీ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవంలో భాగంగా కూకట్‌పల్లిలోని అశోకా వన్ మాల్‌లో మెరీడియన్ స్కూల్ విద్యార్థులతో కలిసి అవగాహన కల్పించారు. సైబరాబాద్ ట్రాఫిక్ పోలీస్, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో డ్రైవింగ్, సిగ్నల్స్ గురించి విద్యార్థులు నృత్యాలు, డప్పులు వాయిస్తూ మాల్‌కు వచ్చిన వారికి వివరించారు. మాల్ ఎండీ ఎన్.జైదీప్‌రెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల వల్ల ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారని, వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ట్రాఫిక్ నియమ, నిబంధనలు పాటిస్తూ వాహనాలను నడిపితే సురక్షితంగా గమ్యస్థానాలకు చేరతారన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి ట్రాఫిక్ ఏసీపీ వెంకటయ్య, ఎస్‌హెచ్‌వో ముత్తు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ట్రాఫిక్ పోలీసులు, మాల్ ఉద్యోగులు

గద్దర్ సిద్ధాంతం మతోన్మాదులకు అర్థం కాదు

బాలానగర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రజా యుద్ధనౌక గద్దర్‌పై కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను తెలంగాణ ప్రోగ్రెసీవ్ యూత్ ఫెడరేషన్(టీపీవైఎఫ్) నాయకులు తీవ్రంగా ఖండించారు. బాలానగర్‌లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి గద్దర్‌పై బండి సంజయ్ చేసిన వాఖ్యలపై బేషరతుగా క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల హృదయాలను గెలుచుకున్న మహోన్నతమైన వ్యక్తి గద్దర్ అని, అలాంటి వ్యక్తి గురించి మాట్లాడేటప్పుడు ఆలోచించి మాట్లాడాలన్నారు. బీజేపీ సిద్ధాంతం బడా పెట్టుబడి, దోపిడిదారులను, మతోన్మాదులను ప్రోత్సహించేది అయితే శ్రామికవర్గం, పేద ప్రజలకు అండగా ఉండి హెచ్చు తగ్గులు లేని సమ సమాజాన్ని కాంక్షించేదని అన్నారు. గద్దర్ సిద్ధాంతం మతోన్మాదులకు అర్థం కాదని, బండి సంజయ్ దిగజారుడు రాజకీయాలకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. టీపీవైఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నగేష్ సతీష్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు టీపీవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మట్టి ప్రసన్న ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో ఫెడరేషన్ ముఖ్య సలహాదారుడు జగన్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ నర్సింగ్‌రావు, సహాయక కార్యదర్శి అఖిల్, బాలానగర్ డివిజన్ కార్యదర్శి మల్లేష్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ ప్రోగ్రెసీవ్ యూత్ ఫెడరేషన్ నాయకులు

హెచ్‌యూజేకు జర్నలిజంలో సుధీర్ఘ చరిత్ర ఉంది

● మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు



హెచ్‌యుజే డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు తదితరులు

బర్కత్‌పుర, జనవరి 29(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ (హెచ్‌యుజే)కు జర్నలిజంలో సుధీర్ఘ చరిత్ర ఉందని, ఎందరో సీనియర్ పాత్రికేయులు ఈ సంఘంలో బాధ్యులుగా కొనసాగి విశిష్ట సేవలందించారని రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు కొనియాడారు. బుధవారం మినిస్టర్స్ క్వార్టర్స్‌లో హెచ్‌యుజే-2025 మీడియా డైరీని హెచ్‌యూజే అధ్యక్షుడు శిగ శంకర్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు కె.విరహత్ ఆలీతో కలిసి మంత్రులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్, ప్రభుత్వ సలహాదారులు వేంనరేందర్‌రెడ్డి, మాజీ మంత్రి షబ్బీర్ ఆలీ, ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్, టీయూడబ్ల్యూజే ఉప ప్రధాన కార్యదర్శి కె.రాములు, కార్యదర్శి వర్కాల యాదగిరి, హెచ్‌యూజే కార్యదర్శి అబ్దుల్ అమీర్ షౌకత్, ఉపాధ్యక్షులు జే.పి.చారి, లక్ష్మణ్, ఇబ్రహీం, కోశాధికారి శ్రావణ్‌కుమార్, కార్యవర్గ సభ్యులు గౌస్ మోహినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు

కేపీహెచ్‌బీకాలనీ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ కేఎస్ఎస్(కాకతీయ సేవా సమితి) మొత్తం 18 సభ్యులతో నూతన కమిటీ ఏర్పాటైంది. కేపీహెచ్‌బీ పరిధిలోని అన్నీ ప్రాంతాలకు ప్రాతినిధ్యం కల్పిస్తూ గతంలో ఉన్న ఐదుగుర్ని తొలగించి వారి స్థానంలో కొత్తవారికి అవకాశం కల్పించారు. కిలారు శ్రీనివాస బాబు, జాగర్లమూడి సుబ్బారావు, కొల్లి సత్యనారాయణ, కామేపల్లి సాంబశివరావు, చిలుకూరి సత్యనారాయణను కొత్తగా కమిటీలోకి తీసుకున్నారు. మూడు సంవత్సరాల పాటు ఈ కమిటీలో బాగా పనిచేసే వారిని కొనసాగించడం, కొత్తగా ఎవరైనా సంఘానికి సేవ చేయాలనుకునే వారికి రానున్న దఫాలో మార్పు, చేర్పులుచేసి అవకాశం కల్పిస్తామని అధ్యక్ష, కార్యదర్శులు గణేశుని అజయ్ కుమార్, ఆలూరి శంకర్ తెలిపారు.

ముగిసిన చెంగిచర్ల కమేళా లీజు గడువు

ఉప్పల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): చెంగిచర్లలోని పశు వధశాల(స్లాటర్ హౌజ్- కమేళా) లీజు గడువు ముగిసింది. ఏడాదికి ఒకసారి ఈ కమేళాను నిర్వహించేందుకు ప్రభుత్వ పశుసంవర్ధకశాఖ మేకలు గొర్రెల అభివృద్ధి సహకార సమాఖ్య సంస్థ టెండర్లు పిలుస్తుంది. అయితే గతంలో ఈ టెండర్ పొందిన మహ్మద్ సలీమ్ కంపెనీ గడువు ఈ నెల 21తో ముగియడంతో ఆ గడువును 28వ తేదీ వరకూ పొడిగించారు. ఆ గడువు కూడా ముగియడంతో సత్వరమే టెంటర్లు పిలవాల్సిందిగా పశుసంవర్థక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సవ్యసాచి ఘోష్ ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 21 మేకల గొర్రెల అభివృద్ధి సహకార సమాఖ్య మేనేజింగ్ డైరెక్టర్ బోర్డు మీటింగ్‌లో తీసుకున్న నిర్ణయం మేరకు మహ్మద్ సలీమ్ వెంటనే స్లాటర్ హౌజ్‌ను ఖాళీ చేయాలని ఆదేశిస్తూ కొత్త టెండర్ ప్రక్రియ చేపట్టారు.

జర్నలిస్టుల పేరుతో వసూళ్లు చేయడం తగదు

● జంట సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లకు జర్నలిస్టుల వినతి

కేపీహెచ్‌బీకాలనీ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులకు ఇవ్వాలని చెప్పి టౌన్‌ప్లానింగ్ అధికారులు భవన నిర్మాణదారుల నుంచి డబ్బులు వసూళ్లు చేస్తున్నారని కూకట్‌పల్లి ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు కూకట్‌పల్లి, మూసాపేట్ డీసీలు గంగాధర్, వంశీకృష్ణను కలిసి వినతి పత్రం అందజేశారు. జర్నలిస్టుల విలువలను దిగజారుస్తున్నారని, రాజకీయ నాయకులతో కుమ్మక్కై భవన నిర్మాణదారులను పీక్కుతింటున్నారని తెలిపారు. దీనిని కట్టడి చేయకపోతే కార్యాలయాల ముందు ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు యూనియన్ నాయకులు గడ్డమీది బాలరాజు, ఎంఏ కరీం, దయాసాగర్, నిమ్మల శ్రీనివాస్, మాణిక్యరెడ్డి, గంగరాజు తదితరులు ఉన్నారు.

డిజిటల్ అరెస్ట్ పేరుతో వేధింపులు

● రూ.2.53 లక్షలు కాజేసిన కేటుగాళ్లు

హైదరాబాద్ సిటీ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మీ పేరుతో ఉన్న పార్సిల్‌లో డ్రగ్స్ ఉన్నాయని ప్రారంభించి, మనీ లాండరింగ్ కేసుల పేరు చెప్పి, 9 రోజుల పాటు డిజిటల్ అరెస్ట్ అంటూ భయపెట్టిన సైబర్ నేరగాళ్లు నగరవాసి నుంచి రూ.2.53 లక్షలు దోచేశారు. నగరానికి చెందిన వ్యక్తి(30)కి ఆటోమేటెడ్ కాల్ వచ్చింది. డీహెచ్ఎల్ నుంచి సంప్రదిస్తున్నామని, మీ పార్సిల్ రిజెక్ట్ అయిందని రికార్డెడ్ వాయిస్ వచ్చింది. వివరాల కోసం 1కి డయల్ చేయాలని సూచన రావడంతో, బాధితుడు 1 నొక్కాడు. డీహెచ్ఎల్ ప్రతినిధి అని పరిచయం చేసుకున్న అవతలి వ్యక్తి.. మీ పేరున ముంబై నుంచి దుబాయ్ వెళ్లే పార్సిల్‌లో ఎండీఎంఏ డ్రగ్ లభ్యమైందని, పోలీసులు విచారణ చేస్తున్నారని చెప్పాడు. పోలీసులతో సంప్రదించమంటూ ఫోన్ కలిపాడు. ముంబై పోలీస్ అధికారినంటూ పరిచయం చేసుకున్న మరోవ్యక్తి మీ ఆధార్ నంబర్, వివరాలతో ముంబై అంధేరి బ్యాంక్‌లో ఖాతా ఉందని, ఈ ఖాతా నుంచి విదేశాలకు డబ్బు మళ్లించారని చెప్పాడు. మనీ లాండరింగ్ కేసులో అరెస్టయిన వ్యక్తి వద్ద మీ ఏటీఎం కార్డు ఉందని, అందువల్లే అనుమానితుడి కింద కేసు నమోదు చేశామని చెప్పాడు. తనకు పార్సిల్‌కు, బ్యాంక్ ఖాతాలకు ఎలాంటి సంబంధం లేదని బాధితుడు చెప్పినప్పటికీ సైబర్ నేరగాడు వినిపించుకోలేదు. కేసు దర్యాప్తులో భాగంగా డిజిటల్ అరెస్ట్ అంటూ భయపెట్టిన నేరగాడు, అతడి బ్యాంకు ఖాతాల వివరాలు తీసుకున్నాడు. 9 రోజుల పాటు విచారణ పేరుతో భయపెట్టి రూ.2.53 లక్షలు తమ ఖాతాల్లో జమ చేయించుకున్నాడు. కేసు దర్యాప్తు గురించి ఇతరులకు చెప్పకూడదని, ఇది దేశ రహస్యాలకు సంబంధించినదని చెప్పాడు. దర్యాప్తు గురించి ఇతరులతో చెబితే జైలు శిక్షతోపాటు రూ.5 లక్షల జరిమానా ఉంటుందని భయపెట్టాడు. అంతేకాకుండా బాధితుడి పేరుతో పర్సనల్ లోన్ తీయించే ప్రయత్నం చేశాడు. లోన్ రాకపోవడంతో సైబర్ నేరగాళ్లు ఫోన్ చేయడం మానేశారు. డబ్బు తిరిగి జమ కాకపోవడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైం ఠాణాలో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గచ్చిబౌలిలో ట్రాఫిక్ మళ్లింపు

హైదరాబాద్‌సిటీ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి జంక్షన్ నుంచి కొత్తగా ఎస్ఆర్‌డీపీ ప్రాజెక్టులో భాగంగా జీహెచ్ఎంసీ నిర్మిస్తున్న శిల్పా లేఅవుట్ ఫేజ్-2 ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం పనుల నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లింపు చేపడుతున్నట్లు సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసు విభాగం అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29 నుంచి 2 నెలల పాటు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని, ఇందులో భాగంగా కొండాపూర్ వైపు నుంచి గచ్చిబౌలివైపు వచ్చే వాహనాలను రెండు మార్గాల్లో మళ్లిస్తున్నామని తెలిపారు. జేపీహెచ్ఎస్ వైపు నుంచి వచ్చే వాహనాలు యూ టర్న్ తీసుకొని రోలింగ్ హిల్స్ మీదుగా శిల్పా ఫ్లైఓవర్ మీదుగా గచ్చిబౌలి చేరుకోవచ్చని, అదేవిధంగా ర్యాడిసన్ హోటల్ ముందు నుంచి డీఎల్ఎఫ్- ట్రిపుల్ ఐటీ జంక్షన్-ఇందిరానగర్ మీదుగా గచ్చిబౌలి వెళ్లవచ్చని తెలిపారు. అదేవిధంగా గచ్చిబౌలి చౌరస్తా వైపు కొండాపూర్ వెళ్లే వాహనదారులు డీఎల్ఎఫ్ రోడ్డు, ర్యాడిసన్ హోటల్ నుంచి ఎడవ వైపు తీసుకొని కొండాపూర్ వెళ్లవచ్చని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. ఫ్లైఓవర్ నిర్మాణ పనులు 2 నెలల పాటు జరుగుతున్న నేపథ్యంలో వాహనదారులు ట్రాఫిక్‌పోలీసులు సూచించిన మార్గాల్లో రాకపోకలు సాగించాలని పేర్కొన్నారు.


గంగారం పెద్ద చెరువు కట్టకింది నుంచి రోడ్డు వేసే ప్రాంతం ఇదే

తీరనున్న అపర్ణవాసుల కష్టాలు

80 అడుగుల రోడ్డును నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం

చందానగర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): చందానగర్ డివిజన్ అపర్ణ నివాసితుల కల తీరనుంది. కాలనీకి ఇరుకైన రోడ్డుతో రాకపోకల సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చందానగర్ జాతీయ రహదారి గంగారం చౌరస్తా నుంచి వీజేఆర్ కాలనీ, కేఎస్ కాలనీ నుంచి అపర్ణ వరకు రోడ్డు ఇరుకుగా ఉంది. సమారుగా 30 అడుగుల రోడ్డుతో ఇక్కట్లు పడుతున్నారు. అపర్ణ హిల్‌పార్క్, లేక్వ్యూతో కలిసి సుమారుగా 2,750 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఇక్కడ నివాసితులు సాఫ్ట్‌వేరు ఇంజనీర్లతోపాటు వివిధ రంగాల్లో ఉన్నత పదవుల్లో ఉన్నవారు ఉంటున్నారు. అయితే వీరి వద్ద రెండు కంటే ఎక్కువగా వాహనాలు ఉన్నాయి. రాకపోకల సమయంలో రద్దీ ఎక్కువ ఓ కారణమైతై, ఇరుకైన రహదారి మరోకారణం. దీంతో ఉదయం సాయంత్రం అరకిలోమీటరు వరకు వెళ్లాలంటే సుమారు గంట సేపు సమయం పడుతుంది. ఉదయం సరైన సమయంలో కార్యాలయాలకు వెళ్లలేకపోతున్నామని పలువురు అంటున్నారు. సమస్యను పరిష్కారించాలని అధికారులను, ప్రజాప్రతినిధులను వేడుకున్నారు. సమస్య ను ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ కార్పొరేటర్‌తో కలిసి పరిశీలించారు. ప్రస్తుతం గంగారం చౌరస్తా నుంచి వీజేఆర్ మీదుగా వెళ్లే రాహదారి ఇరుకుగా ఉంది. దీంతో ప్రత్యామ్నాయంగా రోడ్డు గురించి అధికారులు ప్రణాళికలను సిద్ధం చేశారు.

ఇక్కడి నుంచి మరో రోడ్డు..

గంగారం హనుమాన్ దేవాలయం పక్క నుంచి గంగారం పెద్దచెరువు కట్ట కింది నుంచి 80 అడుగుల రోడ్డును నిర్మించేందుకు అధికారులు ప్రణాళికను సిద్ధం చేశారు. ఇప్పటికే గంగారం నుంచి ఆపర్ణ వరకు జీహెచ్ఎంసీ, ఇరిగేషన్ రెవెన్యూ అధికారులు సంయుక్తంగా సర్వే చేసి హద్దులను బిగించారు. నేడోరేపో నిధులు మంజూరైతే పనులు ప్రారంభం కానున్నాయి. దీంతో కాలనీవాసుల సమస్య తీరనుంది.

సమస్యను పరిష్కరిస్తాం



చందానగర్ అపర్ణవాసులు రోడ్డు ఇరుకుగా ఉండడంతో రాకపోకల సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను గమనించి అధికారులకు, ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లాం. ఎమ్మెల్యే క్షేత్రస్థాయిలో వివిధ విభాగాల అధికారులతో పరిశీలించిన అనంతరం రోడ్డు నిర్మించాలని, అందుకు రోడ్డు మ్యాపింగ్, బడ్జెట్‌ను తయారు చేసి పంపించాలని సూచించారు. నేడోరేపో బడ్జెట్ వస్తే పనులు ప్రారంభించి సమస్యను పరిష్కారిస్తాం.

- కార్పొరేటర్ మంజులరాఘునాథ్‌రెడ్డి


వివిధ విత్తన కంపెనీలు, ఎన్జీఓలు, ప్రభుత్వ సంస్థలు, విద్యాసంస్థలకు చెందిన వారితో ఈసీహెచ్ఓ జనరల్ సెక్రటరీ డాక్టర్ దావులూరి

టీ-హబ్‌లో ఈసీహెచ్ఓ సమావేశం

రాయదుర్గం,జనవరి29(ఆంధ్రజ్యోతి): ఎనేబులింగ్ చైల్డ్ అండ్ హ్యూమన్ రైట్స్ విత్ సీడ్ ఆర్గనైజేషన్స్ సమావేశం గచ్చిబౌలిలోని టీ-హబ్‌లో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ విత్తన కంపెనీలు, ఎన్జీఓలు, ప్రభుత్వ సంస్థలు, విద్యాసంస్థలకు చెందిన 100 మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈసీహెచ్ఓ జనరల్ సెక్రటరీ డాక్టర్ దావులూరి ప్రతినిధులతో కలిసి బ్రోచర్ ఆవిష్కరించారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి

ఆస్తిపన్ను వసూలు చేయాలి : డీసీ

చందానగర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సకాలంలో ఆస్తిపన్ను చెల్లించి జీహెచ్ఎంసీకి, అభివృద్ధికి పన్ను చెల్లింపుదారులు సహకరించాలని చందానగర్ ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి కోరారు. ఆస్తిపన్ను వసూలుపై బుధవారం చందానగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ కల్యాణ మండపంలో జీహెచ్ఎంసీ రెవెన్యూ విభాగం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సకాలంలో ఆస్తిపన్ను వసూలుకు అధికారులు కృషి చేయాలన్నారు. ఆయా ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు ప్రత్యేకచొరవ తీసుకుని 100 శాతం పన్ను వసూలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎంసీలు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తిచేయాలి

చందానగర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను కచ్చితంగా సకాలంలో పూర్తి చేయాలని చందానగర్ సర్కిల్ ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం చందానగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ కల్యాణ మండపంలో సర్వే చేసే సిబ్బంది, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. సర్కిల్ పరిధిలోని మదాపూర్, మియాపూర్, చందానగర్, హాఫీజ్‌పేట్ నాలుగు డివిజన్ల నుంచి సమారుగా 1,11,059 దరఖాసులు వచ్చాయన్నారు. వాటిలో 85శాతం క్షేత్రస్థాయిలో సర్వే పూర్తిచేశామన్నారు. సూపర్ చెక్కింగ్ కూడా 75 శాతం పూర్తిచేశామని, మిగిలిన సర్వేను పూర్తిచేయాలని మోహన్‌రెడ్డి ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు, సూపర్‌వైజర్లు, సర్వే సిబ్బంది ఉన్నారు.

అప్రమత్తంగా ఉండండి.. ఆపదలో పడకండి

- హెచ్‌సీయూ విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీ కౌన్సిల్ ఇన్‌స్పెక్టర్ ఆశిష్‌రెడ్డి పిలుపు
- సైబర్ క్రైమ్‌పై ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు
- కాంబోడియాలో కాల్‌సెంటర్లు


సైబర్ క్రైమ్ అవగాహన సదస్సులో పాల్గొన్న అతిథులు, నిర్వాహకులు

హైదరాబాద్ సిటీ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా వినియోగం, ఆన్‌లైన్ గేమింగ్, నగదు లావాదేవీల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ సైబర్‌క్రైమ్ విభాగం ఇన్‌స్పెక్టర్ ఆశిష్‌రెడ్డి విద్యార్థులకు పిలుపునిచ్చారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీసెల్, ఉన్నత విద్యామండలి సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం సైబర్ క్రైమ్‌పై హెచ్‌సీయూలో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ ఆశిష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆన్‌లైన్‌లో మనమిస్తున్న వ్యక్తిగత సమాచారాన్ని నేరస్థులు తెలివిగా వినియోగించుకుంటున్నారని, కాంబోడియాలో కాల్‌సెంటర్లు ఏర్పాటు చేసుకున్న కాల్‌సెంటర్ల నుంచి ఫోన్లు చేసి మనం కష్టపడి సంపాదించిన ధనాన్ని దోచుకుంటున్నారని చెప్పారు. విదేశాల నుంచి సైబర్ స్లేవరీ ద్వారా ఇండియాలో వ్యక్తులను పార్ట్‌టైమ్‌గా ఉద్యోగాలు కల్పించి వారిని సైబర్‌నేరాలకు పాల్పడేలా ప్రేరేపిస్తున్నారని పేర్కొన్నారు. కొన్ని సందర్భాల్లో అసలైన నిందితులను పట్టుకోవడం ఎంత ప్రయత్నించినా సాధ్యం కావడం లేదన్నారు.

బ్యాంకుల్లో బాలెన్స్‌ను కోల్పోయిన ఫిర్యాదుదారులు వెంటనే సైబర్‌క్రైమ్‌కు ఫిర్యాదు చేస్తే కొంతవరకు నగదును వెనక్కి తీసుకోగలమని, ఎక్కువ సమయం గడిచేకొద్దీ నిందితులు ఆ సొమ్మును వేరేవేరే ఖాతాలకు బదిలీ చేస్తే సొమ్మును తిరిగి తీసుకునే అవకాశాలు ఉండకపోవచ్చన్నారు. నగదు చెల్లింపులే కాకుండా సోషల్ మీడియాలో ఫొటోలు, వీడియోలు పంచుకోవడం, అపరిచిత వ్యక్తులతో చాటింగ్ చేయడం, తెలియని వారు పంపిన ఈ-మెయిల్స్ లింకులను ఓపెన్ చేయడం వల్ల కూడా ఆపదలో చిక్కుకునే ప్రమాదం ఉందన్నారు. ఆన్‌లైన్ ఖాతాలను ఎప్పటికప్పుడు లాగ్ అవుట్ చేయడం, సోషల్ మీడియాలో ప్రైవసీ కంట్రోల్‌ను సెట్ చేసుకోవడం, ఆన్‌లైన్‌లో ఏదేని పోస్టు చేసేటప్పుడు ఒకటికి రెండుసార్లు ఆలోచించడం, డివిజ్‌లో మానిటరింగ్ యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకోవడం, ఫొటోలు, వీడియోలను పంచుకునేముందు ఆలోచన చేయడం, సైబర్ బుల్లింగ్‌పై లోతైన పరిజ్ఞానం కలిగి ఉండడం, వివిధ సోషల్‌మీడియా ఖాతాలకు వేర్వేరు పాస్‌వర్డ్‌లను వాడడం, ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యక్తిగత ఖాతాల పాస్‌వర్డ్‌లను ఇతరులకు తెలవకుండా జాగ్రత్త పడడం చాలా ముఖ్యమన్నారు. ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930 ఫోన్ చేయడం లేదా సైబర్‌క్రైమ్.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిజిటల్ లిటరసీ టు సెక్యూర్ యూత్ (దిలీసే) వలంటీర్లు సునీల్ సోమనగుర్తి, సాయినాథ్‌చారి, ఉన్నత విద్యామండలి కన్సల్టెంట్ అన్నపూర్ణ గాదెపల్లి, హెచ్‌సీయూ స్టూడెంట్ వెల్ఫేర్ విభాగం డిప్యూటీ డీన్ రుక్మరేఖ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌యూజేకు జర్నలిజంలో సుధీర్ఘ చరిత్ర ఉంది

మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు


హెచ్‌యుజే డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు

బర్కత్‌పుర, జనవరి 29(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్‌యూజే)కు జర్నలిజంలో సుధీర్ఘ చరిత్ర ఉందని, ఎందరో సీనియర్ పాత్రికేయులు ఈ సంఘంలో బాధ్యులుగా కొనసాగి విశిష్ట సేవలందించారని రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు కొనియాడారు. బుధవారం మినిస్టర్స్ క్వార్టర్స్‌లో హెచ్‌యూజే-2025 మీడియా డైరీని హెచ్‌యూజే అధ్యక్షుడు శివశంకర్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు కె.విరహత్ అలీతో కలిసి మంత్రులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్ కుమార్‌యాదవ్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మాజీ మంత్రి షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్, టీయూడబ్ల్యూజే ఉప ప్రధాన కార్యదర్శి కె.రాములు, కార్యదర్శి వర్కాల యాదగిరి, హెచ్‌యూజే కార్యదర్శి అబ్దుల్ అమీర్‌షౌకత్, ఉపాధ్యక్షులు జేపీ.చారి, లక్ష్మణ్, ఇబ్రహీం, కోశాధికారి శ్రావణ్‌కుమార్, కార్యవర్గ సభ్యులు గౌస్ మోహినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కల్తీ మద్యం ముఠా గుట్టు రట్టు

- రూ. 8లక్షల కల్తీ మద్యం స్వాధీనం
- 8 మందిపై కేసు నమోదు చేసిన ఎక్సైజ్ పోలీసులు

హైదరాబాద్ సిటీ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఖరీదైన మద్యం బాటిళ్లలో తక్కువ ధర కల్గిన మద్యాన్ని నింపి లక్షల గడిస్తున్న ఒడిశా ముఠాను బుధవారం హైదరాబాద్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు పట్టుకున్నారు. హైదారాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ చంద్రశేఖర్, అమీర్‌పేట్ సీఐ బానోత్‌పటేల్ సిబ్బంది కలిసి అమీర్‌పేట్ కృష్ణానగర్ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించారు. అనుమానంగా ఉన్న ఇద్దరు వ్యక్తుల వద్ద ఉన్న బ్యాగ్‌లో తనిఖీ చేయగా ఖరీదైన తొమ్మిది నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ బాటిళ్లు లభించాయి. దీంతో వారిచ్చిన సమాచారం మేరకు మదాపూర్ అయ్యప్ప సొసైటీలోని సాయినగర్‌లోని ఒక ఇంట్లోకి వెళ్లారు. ఈ ఇంట్లో మరో ముగ్గురు వ్యక్తులు ఖరీదైన మద్యం బాటిళ్లలో తక్కువ ధరలు కలిగిన మద్యాన్ని నింపుతుండగా పట్టుకున్నారు. పట్టుబడిన ముగ్గురూ ఒడిశాకు చెందిన రుద్రాపత్రాప్ రౌత్, సత్యప్రకాష్‌రౌత్, రింకుజాన్‌గా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఖరీదైన 14 మద్యం బాటిళ్లను, 63 ఖాళీ మద్యం బాటిళ్లను, బాటిళ్లపై ఉండే బాక్సులు, మూతలను స్వాదీనం చేసుకున్నారు. పట్టుకున్న మద్యం విలువ రూ.8 లక్షల మేరకు ఉంటుందన్నారు. 5 సెల్ ఫోన్లు, ఒక స్కూటీని కూడా స్వాదీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. మొత్తం 8 మందిపై కేసు నమోదుచేసి పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నారు. ఈ ముఠా కొంతకాలంగా పలు రకాల మద్యం ఈవెంట్లో, బార్లలో పనిచేస్తూ ఖరీదైన మద్యం బాటిళ్లను లేబుళ్లను, మూతులను సేకరిస్తుండేవారు. దీంతో బాటిళ్లలో తక్కువ ధరలు కలిగిన మద్యాన్ని నింపి రూ.25వేల మద్యం బాటిల్‌ను రూ.16 వేలకు అమ్మకాలు జరుపుతు సొమ్ముచేసుకుంటున్నారని విచారణలో తేలింది. ఈ ముఠాను పట్టుకున్న టీమ్‌లో సీఐలతోపాటు ఎస్సై శ్రీనివాస్, హెడ్‌కానిస్టేబుల్ మల్లికార్జున్, కానిస్టేబుళ్లు కరణ్, శ్రీకాంత్, గోపాల్, అక్షర, చరణ్, ప్రతాప్, నిఖిల్, నవీన్ ఉన్నారు.

కృత్రిమ మేధను అందిపుచ్చుకోవాల్సిందే : డా.ప్రీతి రఘునాథ్


విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న డాక్టర్ ప్రీతి రఘునాథ్

పటాన్‌చెరు రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): అధునాతన పరిజ్ఞానాలైన కృత్రిమ మేధ (ఏఐ), ఆర్టిఫీషియల్ జనరల్ ఇంటెలిజెన్స్ (ఏజీఐ)లను భారతీయులు కూడా అందిపుచ్చుకోవాలని, అత్యంత ఖర్చు, వ్యయప్రయాసలతో కూడినదైనా దానిని వదులుకోకూడదని బ్రిటన్, షెఫీల్డ్ విశ్వవిద్యాలయంలోని డిజిటల్ మీడియా అధ్యాపకురాలు డాక్టర్ ప్రీతిరఘునాథ్ అభిప్రాయపడ్డారు. 'తెలంగాణలో కృత్రిమ మేధ విధానాలు, మౌలిక సదుపాయాలు, అభ్యాసాలు ప్రారంభ ముద్రలు' అనే అంశంపై గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్‌హెచ్ఎస్)లో బుధవారం ఆమె మాట్లాడారు. రాజకీయశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ రఘునాథ్ తన పైలట్ పరిశోధన అధ్యయనం ప్రారంభ ఫలితాలను సభ్యులకు వివరించారు. ముఖ్యంగా నిజామాబాద్, హైదరాబాద్ నుంచి రెండు కీలక కేస్ స్టడీలను ఆమె ప్రముఖంగా ప్రస్తావిస్తూ, తెలంగాణలో కృత్రిమ మేధ సంక్లిష్ట దృశ్యాన్ని ఆవిష్కరించారు. ఈ స్థానిక ఉదాహరణలను జాతీయ, అంతర్జాతీయ ఏఐ అభివృద్ధి విస్తృత చట్రాలలో పరిశీలించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ రంగంలో తెలంగాణ పథం క్లిష్టమైన విశ్లేషణలను డాక్టర్ రఘునాథ్ అందించారు. జీవనోపాధి, అభివృద్ధి మధ్య సంక్లిష్ట పరస్పర చర్య, సామాజిక, పర్యావరణ పరిగణనలు, దక్షిణ అర్ధగోళంలో (గ్లోబల్ సౌత్) అభివృద్ధి చెందుతున్న దేశాల చిక్కులను వివరించారు. ఆర్థికవృద్ధి, స్థిరమైన అభివృద్ధి మధ్య సమతుల్యత, ఏఐ ప్రపంచ కథనంలో స్థానిక సందర్భాలను గుర్తించడం ప్రాముఖ్యతలను ప్రస్తావించారు. తొలుత, జీఎస్‌హెచ్ఎస్ డైరెక్టర్ ప్రొఫెసర్ సన్నీ గోస్మాన్ జోస్ అతిథిని ఆహ్వానించి, విద్యార్థులకు పరిచయం చేశారు.



ముస్తాబవుతున్న భెల్ పెద్దమ్మ తల్లి దేవాలయం

రేపటి నుంచి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం

భెల్ పెద్దమ్మతల్లి దేవాలయంలో ఏర్పాట్లు పూర్తి

భెల్‌కాలనీ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): బీహెచ్ఈఎల్ పెద్దమ్మతల్లి దేవాలయం ధ్వజస్తంభ ద్వాదశ ప్రతిష్ఠాపన ఉత్సవాలకు సర్వాగసుందరంగా ముస్తాబైంది. పెద్దమ్మతల్లి దేవాలయంలో మహోత్సవాలను శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నారు. భెల్ ఈడీ, అధికారులు అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించి ఉత్సవాలను ప్రారంభిస్తారు. అనంతరం గణపతిపూజ, పుణ్యావచనం, పచగవ్య ప్రాశనం, దీక్షాధారణ, నవగ్రహ ఆరాధాన, వాస్తుపురుష ఆరాధన, సర్వతో భద్ర ఆరాధాన, దేవాలయ సంప్రోక్షణ తదితరుల పూజలు జరుగుతాయి. సాయంత్రం సామూహిక కుంకుమార్చనలు, మంగళనీరాజనం, మంత్రపుష్పం, వేదపండితుల ఆశీర్వచనం తదితర పూజలు జరుగనున్నాయి. శనివారం ఉదయం స్థాపిత మంటప పూజలు, మూలమంత్రహోమం, పూర్ణాహుతి, ఆలయ శిఖర మహాకుంభాభిషేకం, అన్నసంతర్పణ జరుగుతాయి. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఉత్సవాలకు భారీఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు సమావేశంలో తెలిపారు. విద్యుత్ సరఫరా, మంచినీరు. పారిశుధ్య నిర్వహణ పనులను చేపట్టి, అన్ని వసతులను కల్పించేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు.


శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలు, వంటకాలు తయారు చేస్తున్న మహిళలు

నిథమ్‌లో ముగిసిన ఇందిరా మహిళా శక్తి శిక్షణ

రాయదుర్గం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలోని నిథమ్‌లో పది రోజుల పాటు నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ నిర్వహణ శిక్షణ బుధవారం ముగిసింది. ఈ శిక్షణలో 29మంది మహిళలు పాల్గొన్నారు. శిక్షణలో భాగంగా అన్నం, టీ రకాలు, తెలంగాణ స్నాక్స్, స్వీట్లు, బేసిక్ గ్రేవీస్, బిర్యానీ, సావరీ వంటి వంటల్లో శిక్షణ అందించారు. శిక్షణ పూర్తిచేసుకున్న వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. నిథమ్ డైరెక్టర్ హనుమంత్ కొండిబా మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ నిర్వహణ శిక్షణ అనేకమంది మహిళలకు విజయవంతమైన వ్యవస్థాపకులుగా మారడానికి అవకాశం కల్పిస్తుందన్నారు. ఇప్పటి వరకు 7 బ్యాచ్‌ల్లో 190 మంది మహిళలు శిక్షణ పొందారని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, చెఫ్‌లు, మహిళలు పాల్గొన్నారు.

వీధిదీపాల సమస్యను పరిష్కరిస్తాం : కార్పొరేటర్


స్ట్రీట్‌లైట్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీకాంత్

మియాపూర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ డివిజన్‌లోని ప్రతి కాలనీలో వీధిదీపాల సమస్యను పరిష్కరిస్తామని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. బుధవారం మియాపూర్ డివిజన్ పరిధిలోని స్టాలిన్‌నగర్ కాలనీలో నూతనంగా వీధిదీపాలను అమరుస్తున్న పనులను స్థానిక నాయకులతోకలిసి కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రతి కాలనీలో విడతలవారీగా వీధిదీపాలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ స్ట్రీట్ లైట్స్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, స్టాలిన్‌నగర్ కాలనీవాసులు రాణి, వెంకటేష్, శ్యామల, నరేష్, మొహిన్‌బాయి, హనుమంతరావు, సాగర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



దోమల మందు పిచికారిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

ఎల్లమ్మచెరువులో దోమల మందు పిచికారి

హైదర్‌నగర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మ చెరువు పరిసర ప్రాంతాల ప్రజలు దోమల బెడద సమస్య ఎక్కువగా ఉందని స్థానిక కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన కార్పొరేటర్ బుధవారం ఎంటమాలజీ సిబ్బందితో కలిసి దోమల నివారణం కోసం ఎల్లమ్మచెరువులో దోమల మందును డ్రోన్‌సాయంతో పిచికారి చేశారు. కార్యక్రమంలో గుడ్ల శ్రీనివాస్, ఎంటమాలజీ సూపర్‌వైజర్ నరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి

- పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ
- హాఫీజ్‌పేటలో రూ.70 లక్షలతో సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన


సీసీరోడ్డు పనుల శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు జగదీశ్వర్‌గౌడ్, పూజిత

మియాపూర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి మార్గదర్శకంలో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నామని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. హాఫీజ్‌పేట డివిజన్ హాఫీజ్‌పేటలో రూ.70లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులకు బుధవారం కార్పొరేటర్లు పూజిత, జగదీశ్వర్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ హాఫీజ్‌పేటలోని బావార్చి హోటల్ నుంచి వార్డు కార్యాలయం, ఖైదమ్మకుంట చెరువు రోడ్డు వరకు, మైత్రినగర్ ఫేస్-1 కాలనీలో సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేశామన్నారు. కాలనీలవాసులకు ఉపశమనం లభిస్తుందని, అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామన్నారు. సీసీరోడ్డు వంటి అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలన్నారు. ప్రజలకు ట్రాఫిక్ రహిత, సుఖవంతమైన మెరుగైన రవాణా సౌకర్యంకు కృషిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు, కాలనీల అసోసియేషన్ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

● హాఫీజ్‌పేట్ డివిజన్ యూత్‌కాలనీలో సమస్యలు, చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపై కార్పొరేటర్లు పూజిత, జగదీశ్వర్‌గౌడ్‌తో, జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు రోడ్లువేయాలని, డ్రైనేజీ, మంచి నీటి వ్యవస్థను మెరుగుపర్చాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ యూత్‌కాలనీలో అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్ల సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని, త్వరలోనే సీసీరోడ్లు వేస్తామని, అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు డీఈ శ్రీదేవి, ఏఈ ప్రతాప్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అడ్డగుట్టకాలనీలో సమస్యలు పరిష్కరించాలి

హైదర్‌నగర్: హైదర్‌నగర్ డివిజన్ అడ్డగుట్ట కాలనీలో సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై పీఏసీ చైర్మన్ ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని వివేకానందనగర్‌లోని ఆయన కార్యాలయంలో కాలనీవాసులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ అడ్డగుట్ట కాలనీలో త్వరలో పర్యటిస్తానని, స్థానిక సమస్యలు, అసంపూర్తిగా ఉన్న రోడ్డు సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. ప్రజలు ఇబ్బందిపడకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అడ్డగుట్ట కాలనీ వాసులు సుబ్బారావు, సత్యనారాయణ రాజు, వేణు, మనోహర్‌రెడ్డి, శివాజీబాబు, రంగరాజు, గోపాల్, శ్రీనివాసరాజు, ఉమపతి, వెంకటేశ్వర రావు, పరమేశ్వర్, విశ్వనాథ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

జలమా? గరళమా?

మురుగు నీటిని తాగేది ఎలా? ● ఫిర్యాదు చేసినా పట్టించుకోని జలమండలి అధికారులు


చంద్రగిరినగర్‌లో సరఫరా అవుతున్న మురుగు నీరు


మురుగు నీటిని బాటిల్‌లో చూపిస్తున్న స్థానికురాలు

గాజులరామారం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తాగునీటి పైపుల్లో డ్రైనేజీ నీరు కలిసి కలుషితం అవుతోందని కాలనీవాసులు మొరపెట్టుకున్నా జలమండలి అధికారులు స్పందించడం లేదు. గాజులరామారం డివిజన్‌లోని చంద్రగిరినగర్‌లో సరఫరా అవుతున్న కలుషితమైన నీటితో ఇబ్బందులు పడుతున్నారు. తాగునీరులో మురుగు కలవడంతో దుర్వాసన వస్తోందన్నారు. ఈ విషయమై సంబంధిత లైన్‌మన్, మేనేజర్‌కు ఫిర్యాదు చేసినా దురుసు సమాధానం చెబుతున్నారని, వారి తీరుపై స్థానికులు మండిపడుతున్నారు. తాగునీటి బిల్లులను విధిగా వసూలు చేస్తున్నారు, కానీ ప్రజలకు తాగునీరు సక్రమంగా ఇచ్చేందుకు సుముఖంగా లేరని మండిపడుతున్నారు. నెల రోజుల నుంచి కలుషితమైన తాగునీరు వస్తున్నా వాటిని వినియోగించుకోలేక, డబ్బులు వెచ్చించి బయట కొనుగోలు చేస్తున్నామని వాపోతున్నారు. ఈ నీటి వల్ల అనారోగ్యం పాలవుతున్నామని, ఈ నీరు తాగిన వారికి కాళ్లు, కీళ్ల నొప్పులు, వాంతులు, విరోచనాలు అవుతున్నాయని, చాలామంది ఆస్పత్రి పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలు వచ్చినపుడు మాత్రం ప్రజలకు హామీలు ఇస్తూ, గెలిచిన తర్వాత హామీలను గాలికొదిలేస్తున్నారని నాయకుల తీరుపై మండిపడుతున్నారు. జలమండలి అధికారులు స్పందించి, కలుషితమవ్వడానికి కారణమైన మురుగునీటి పైప్‌లైన్ గుర్తించి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

పదిలో 10/10 జీపీఏ.. లక్ష్యం

● గాజులరామారం జిల్లా పరిషత్తు హైస్కూల్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
● నైపుణ్యాన్ని వెలికితీస్తున్న ఉపాధ్యాయులు

గాజులరామారం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీస్తూ, పదో తరగతి పరీక్షల్లో 10/10జీపీఏ సాధించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. గాజులరామారం డివిజన్‌లోని గాజులరామారం గ్రామం, జిల్లా పరిషత్తు హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న 80 మంది విద్యార్థులకు ఉపాధ్యాయులు సాయంత్రం సమయంలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ, పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. రోజుకొక సబ్జెక్టు చొప్పున వారికి బోధిస్తున్నారు. గత ఐదు సంవత్సరాల నుంచి ఈ ప్రభుత్వ పాఠశాల ఫలితాలు మండలంలోనే ప్రథమస్థానంలో నిలుస్తోంది. ఇంతేకాకుండా పదో తరగతి నుంచి బయటకు వెళ్లిన తర్వాత కార్పొరేట్ స్థాయిలో ఉండే పోటీని తట్టుకునే విధంగా ప్రధానోపాధ్యాయులు అశోక్ రెడ్డి నేతృత్వంలో ఉపాధ్యాయ బృందం తీర్చిదిద్దుతున్నారు. అలాగే పేద విద్యార్థులకు ఉన్నత చదువు కోసం కార్పొరేట్ సంస్థలతో మాట్లాడి, విద్యార్థులు ఎంతవరకు చదువుకుంటే ఆ చదువుకు అయ్యే ఖర్చునంతా సంస్థల ఉద్యోగులు చూసుకునే విధంగా చూస్తున్నారు. స్టడీ క్లాసుల్లో అల్పాహారాన్ని ఇస్తూ, ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. వీరికి కంప్యూటర్ విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలపై ఆసక్తిని కూడా కల్పిస్తున్నారు. మానసికంగా, శారీరకంగా ఎదిగేందుకు పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించి, చదువులో మెలకువలు నేర్పుతూ, వారికి అర్థమయ్యేవిధంగా పాఠాలను బోధిస్తున్నారు. విద్యార్థులను ఏ, బీ, సీ గ్రూపులుగా విభజించి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు.


విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

పాఠశాల స్థాయి నుంచే బీజం వేయాలి



విద్యార్థులకు చదువుపై ఆసక్తిని పెంపొందించేందుకు కృషి చేస్తున్నాం. గత ఐదు సంవత్సరాల నుంచి మండలంలోని మా పాఠశాల పదోతరగతి పరీక్ష ఫలితాల్లో మొదటిస్థానంలో నిలుస్తోంది.

- అశోక్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు

సులభమైన పద్ధతిలో



సైన్స్ అనగానే విద్యార్థులు భయాందళనకు గురవుతారు. అలాంటి భయాలకు తావులేకుండా సైన్స్‌ను సులభమైన పద్ధతిలో నేర్పుతూ సబ్జెక్టుపై పట్టుసాధించేందుకు కృషి చేస్తున్నాం.

- పుష్పలత, సైన్స్ టీచర్

మొదటిస్థానంలో నిలిచేందుకు



ఈ సంవత్సరం మా పాఠశాల పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండలంలో మొదటిస్థానంలో నిలిచేందుకు కష్టపడుతున్నాం. తెలుగు, ఇంగ్లీష్ మీడియం అనే తేడా లేకుండా కష్టపడి చదివి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పేరును నిలబెడతాం. - ఉమాదేవి, పదో తరగతి విద్యార్థిని

అర్థమయ్యేలా బోధిస్తున్నారు



ఉపాధ్యాయులు అర్థమయ్యే విధంగా పాఠాలను బోధిస్తున్నారు. పదో తరగతి అనగానే ఎలా పాసవ్వాలనే ఆలోచన చేస్తారు. కానీ టీచర్లు చెప్పే పాఠాలు శ్రద్ధగా వింటే ఫలితాలు ఉత్తమ మార్కులను సాధించవచ్చు.

- కార్తీక, పదో తరగతి విద్యార్థిని



భయం లేకుండా..

విద్యార్థులు లెక్కల్లో సూత్రాలను పాటిస్తూ, సులువుగా చేసేవిధంగా కృషి చేస్తున్నాం. లెక్కలు అనగానే భయపడతారు. అలాంటి భయాలు లేకుండా వారిని తీర్చిదిద్దుతున్నాం.

- ఆనంద్ జోషి, లెక్కలు టీచర్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్

ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి

పేట్‌బషీరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో కుత్బుల్లాపూర్, బాచుపల్లి, దుండిగల్ మండళ్ల విద్యాధికారులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వారికి దిశా నిర్దేశం చేశారు. ఆదర్శవంతంగా పాఠశాలలను తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ ఎంఈఓ జమిని కుమారి, బాచుపల్లి ఎంఈఓ రామ్మకష్ణ, దుండిగల్ ఎంఈఓ కృష్ణ అసిస్టెంట్ ఎంఈఓ రమేష్ పాల్గొన్నారు.


బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

గద్దర్‌పై మాట్లాడే అర్హత సంజయ్‌కు లేదు

షాపూర్‌నగర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఏర్పడి పదేళ్ళు గడుస్తున్నా రాష్ట్రంపై కేంద్రం వివక్షత చూపుతోందని, పద్మ అవార్డుల విషయంలో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని తెలంగాణ ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి గొల్ల జాన్ మండిపడ్డారు. బుధవారం నర్సాపూర్ ప్రధాన రహదారి షాపూర్‌నగర్‌లో బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేయడం జరిగింది. ఈ సందర్భంగా జాన్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజాయుద్ధ నౌక గద్దర్ గురించి కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్ మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. ఆయన ఒక క్యాబినేట్ మంత్రి అనే విషయాన్ని మరచి మాట్లడుతున్నారన్నారు. బీజేపీ భావజాలాలు ఉన్న వారికే పద్మ అవార్డులు ఇస్తాం అనేవిధంగా ఆయన మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. గద్దర్‌పై సంజయ్ చేసిన వ్యాఖ్యలు తక్షణమే ఉపసంహరించుకోవాలని హెచ్చరించారు. బీజేపీ అధ్యక్షునిగా ఈటల రాజేందర్ రాబోతున్నాడని తన ప్రాధాన్యం తగ్గిపోతుందన్న ఫ్రేస్టేషన్‌లో ఆయన మాట్లాడుతున్నాడని దుయ్యబట్టారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యక్తలు పాల్గొన్నారు.


సంఘం సభ్యులకు చెక్కును అందజేస్తున్న బైరి ప్రశాంత్‌గౌడ్

ఆలయ నిర్మాణానికి రూ.51వేలు అందజేత

పేట్‌బషీరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ఆలయాల అభివృద్ధికి తమ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని కొంపల్లి పురపాలక సంఘం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బైరి ప్రశాంత్‌గౌడ్ అన్నారు. పురపాలకసంఘం పరిధిలో నూతనంగా విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న వీర బ్రహ్మేంధరస్వామి ఆలయ నిర్మాణానికి రూ.51వేల చెక్కును ఆయన సంఘం సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధితో మానసిక ప్రశాంతత దొరుకుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వకర్మ సంఘం అధ్యక్షులు చంద్రమౌళి, విష్ణుచారి, వెంకటేష్, ఏడుకొండలు, కృష్ణ, సత్యం, అంజి, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.


దరఖాస్తులను పరిశీలిస్తున్న బ్యాంకు అధికారులు

రుణ దరఖాస్తులు పరిశీలించిన బ్యాంకు అధికారులు

కుత్బుల్లాపూర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో మహిళా సంఘాల సభ్యులు రుణాల కోసం చేసుకున్న దరఖాస్తులను సంబంధిత అధికారులు బుధవారం పరిశీలించారు. మహిళలు చిరు వ్యాపారాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆ దరఖాస్తుల వివరాలను తెలుసుకునేందుకు మహిళలు రావడంతో సంబంధిత బ్యాంకు అధికారులు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడనుంది. త్వరలోనే దరఖాస్తు చేసుకున్న వారికి రుణాలను అందజేయనున్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలి


కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

నిజాంపేట్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): బాచుపల్లిలోని వీఎన్ఆర్ వీజేవీటీ కళాశాలలో మంగళవారం ఆటో, హెరిటెస్ట్ 2025 పేరిట పలు కార్యక్రమాలు జరిగాయి. 1886లో ఇదే రోజున ప్రపంచంలో మొట్టమొదటి కారు కోసం కార్ల్ బెంజ్ అనే వ్యక్తి పేటెంట్ సాధించినందుకు గుర్తుగా ఈ కళాశాలలో ఆటో మొబైలింగ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మొట్టమొదటిసారి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తేజస్వి గ్రీన్ ఎనర్జీ సంస్థ వ్యవస్థాపక సంచాలకులు జతిల్‌శర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత అనుభవాలను పంచుకుంటూ జపాన్, యూఎస్ఏ వంటి దేశాలు సాధిస్తున్న విజయాలు మనకు మార్గదర్శకం కావాలన్నారు. భారత ప్రభుత్వం కాంక్షిస్తున్న భరణీయ అభివృద్ధి లక్ష్యసాధనకు వాహన తయారీరంగం స్థిరపడాలని పిలుపునిచ్చారు. మారుతున్న సాంకేతికతకు పర్యావరణహిత పద్ధతులకు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలకు సానపెట్టుకోవాలని సూచించారు. విజ్ఞానజ్యోతి సంస్థ ప్రధాన కార్యదర్శి కోడె దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఒకప్పుడు పెద్దగా అభివృద్ధి చెందని వాహనరంగం నేడు టీవీఎస్, మహీంద్ర వంటి పరిశ్రమల ద్వారా ప్రపంచంలో వివిధ దేశాలకు వాహనాలను, వాటి విడి భాగాలను ఎగుమతి చేసే స్థాయికి చేరుకుందన్నారు. హుండాయ్ వంటి సంస్థలు మన దేశంలో విద్యుత్ వాహనాల తయారీ పరిశ్రమలను నెలకొల్పాలని ముందుకు వస్తున్నాయన్నారు. భారతదేశంలో వాహనరంగం స్థిరంగా ఎదుగుతోందని, వెయ్యిమంది జనాభాకు సగటున 38 వాహనాలు మాత్రమే ఉన్నందున, ఎన్నో అవకాశాలు విద్యార్థులకు ఉన్నాయని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆటోమొబైల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ షైక్ అంజల్, కళాశాల ప్రధాన అధ్యాపకులు సీడీ నాయుడు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలి

నిజాంపేట్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు కాలనీల్లో అనుమతికి మించి అక్రమ కట్టడాలు విచ్చల విడిగా వెలుస్తున్నాయి. ఇంత జరుగుతున్నా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని బాచుపల్లి మండల సీపీఐ కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. నిజాంపేట్‌లోని సర్వే నంబరు 191లో ప్రభుత్వ భూమిని ఆక్రమించి సంతోష్ నాయక్ అనే వ్యక్తి నిబంధనలకు విరుద్ధంగా జీ+6 నిర్మిస్తున్నారన్నారు. ఈ విషయాన్ని మున్సిపల్ అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారని మండిపడ్డారు. అధికారుల తీరుతోనే ఇలాంటి కట్టడాలు అనేక ప్రాంతాల్లో వెలుస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ భూమిని ఆనుకొని ఉన్న 191 సర్వే నంబరు, పక్కనే ఉన్న 87 సర్వేనంబరులో కొంత భూమిని ఆసరాగా చేసుకొని, పూర్తిగా ప్రభుత్వ భూమిలో ఈ అక్రమ నిర్మాణం కొనసాగుతుందని ఆరోపించారు. కనీసం ఈ విషయంలో ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన రెవెన్యూ అధికారులు దరిదాపుల్లోకి కూడా రావడం లేదన్నారు. మున్సిపల్ అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారు కాబట్టే బిల్డర్లు ఇష్టానుసారం నిర్మాణం కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా ఇరు శాఖల అధికారులు స్పందించి దీనిపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నానని చెప్పారు.


అనుమతులకు మించి కొనసాగుతున్న ఆరు అంతస్తుల నిర్మాణం

ముగిసిన చెంగిచర్ల కమేళా లీజు గడువు

● కొత్త టెండర్లకు ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

ఉప్పల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): చెంగిచర్లలోని పశు వధశాల(స్లాటర్ హౌజ్- కమేళా) లీజు గడువు ముగిసింది. ఏడాదికి ఒకసారి ఈ కమేళాను నిర్వహించేందుకు ప్రభుత్వ పశుసంవర్ధకశాఖ మేకలు గొర్రెల అభివృద్ధి సహకార సమాఖ్య సంస్థ టెండర్లు పిలుస్తుంది. అయితే గతంలో ఈ టెండర్ పొందిన మహ్మద్ సలీమ్ కంపెనీ గడువు ఈ నెల 21తో ముగియడంతో ఆ గడువును 28వ తేదీ వరకూ పొడిగించారు. ఆ గడువు కూడా ముగియడంతో సత్వరమే టెంటర్లు పిలవాల్సిందిగా పశుసంవర్ధక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సవ్యసాచి ఘోష్ ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 21 మేకల గొర్రెల అభివృద్ధి సహకార సమాఖ్య మేనేజింగ్ డైరెక్టర్ బోర్డు మీటింగ్‌లో తీసుకున్న నిర్ణయం మేరకు మహ్మద్ సలీమ్ వెంటనే స్లాటర్ హౌజ్‌ను ఖాళీ చేయాలని ఆదేశిస్తూ కొత్త టెండర్ ప్రక్రియ చేపట్టారు.

హెచ్‌యూజేకు జర్నలిజంలో సుదీర్ఘ చరిత్ర ఉంది

● మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు

బర్కత్‌పుర, జనవరి 29(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్(హెచ్‌యుజే)కు జర్నలిజంలో సుదీర్ఘ చరిత్ర ఉందని రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు కొనియాడారు. బుధవారం మినిస్టర్స్ క్వార్టర్స్‌లో హెచ్‌యుజే-2025 మీడియా డైరీని హెచ్‌యూజే అధ్యక్షుడు శిగ శంకర్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు కె.విరహత్ ఆలీతో కలిసి మంత్రులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్, ప్రభుత్వ సలహాదారులు వేమ్‌నరేందర్‌రెడ్డి, మాజీమంత్రి షబ్బీర్ ఆలీ, ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్, టీయూడబ్ల్యూజే ఉప ప్రధానకార్యదర్శి కె.రాములు, కార్యదర్శి వర్కాల యాదగిరి, హెచ్‌యూజే కార్యదర్శి అబ్దుల్ అమీర్ షౌకత్, ఉపాధ్యక్షులు జే.పి.చారి, లక్ష్మణ్, ఇబ్రహీం, కోశాధికారి శ్రావణ్‌కుమార్, కార్యవర్గ సభ్యులు గౌస్ మోహినుద్దీన్ పాల్గొన్నారు.


చెట్ల కొమ్మల మధ్య వెలుగుతున్న వీధి దీపాలు

వీధిలైట్లు వెలుగుతున్నా అంధకారమే

పేట్‌బషీరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వీధిలైట్లకు చెట్ల కొమ్మలు అడ్డుగా ఉండటంతో వెలుతురు రావడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. కొంపల్లి మున్సిపల్‌లోని నార్త్ ఎన్‌సీఎల్ కాలనీ, న్యూజీవీడ్ నుంచి కొంపల్లి మున్సిపల్ కార్యాలయానికి వచ్చే రహదారి పక్కనే ఉన్న వీధిలైట్ల స్తంభాలు చెట్ల మధ్యనే ఉండటంతో ఈ దుస్థితి నెలకొందన్నారు. అలాగే కొన్ని స్తంభాలకు వీధిలైట్లు లేవు. రాత్రి సమయాల్లో రహదారుల వెంట నడుచుకుంటూ వచ్చే స్థానిక ప్రజలకు ఇబ్బందిగా ఉందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి చెట్ల కొమ్మలను తొలగించాలని స్థానిక ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.


కట్టమైసమ్మ దేవాలయం

9 నుంచి కట్టమైసమ్మ జాతర

షాపూర్‌నగర్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 9 ఆదివారం సూరారం శ్రీకట్టమైసమ్మ, రేణుకా ఎల్లమ్మదేవిల జాతర ప్రతి సంవత్సరం మాదిరిగానే వైభవంగా నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ సభ్యులు తెలియజేశారు. జాతర ఫిబ్రవరి 8 నుంచి 12తేదీ వరకు ఐదురోజులపాటు నిర్వహించనున్నారు. జాతర ప్రారంభరోజు అమ్మవారి ఊరేగింపు, ఆదివారం ప్రధాన జాతర, 10న రంగం, 12న అన్నదాన కార్యక్రమంతో జాతర ముగిస్తుందన్నారు. కావున భక్తులు అధికసంఖ్యలో విచ్చేసి అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.


అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మిద్దెల బాల్‌రెడ్డి

అర్హులైన రైతులకు రుణమాఫీ చేయాలి

దుండిగల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): దుండిగల్, గండిమైసమ్మ మండలంలోని బౌరంపేటలో అర్హులైన 632మంది రైతులకు గాను 17 మందికే రుణమాఫీ జరిగిందని బౌరంపేట పీఏసీఎస్ చైర్మన్, డీసీసీబి డైరెక్టర్ మిద్దెల బాల్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా అగ్రికల్చర్ అధికారి చంద్రకళకు మంగళవారం కార్యాలయంలో కలిసి అర్హులైన రైతుల లిస్టుతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. మిగతా 615 మంది రైతులకు రుణమాఫీ కావల్సి ఉన్నాయని, ఎటువంటి నిబంధనలు లేకుండా మాఫీ చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా చైర్మన్లు రందీష్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నకిలీ ఆధార్ కార్డుతో భూమిని విక్రయించిన వ్యక్తి అరెస్ట్


అసలైన రామరాజు


నకిలీ పత్రాల్లో ఉన్న నాగరాజు

దుండిగల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నకిలీ భూమి పత్రాలు సృష్టించి, వేరొకరి పేరుపై ఉన్న స్థలాన్ని తమ స్థలంగా చెప్పుకుని విక్రయించిన వ్యక్తిని దుండిగల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మేడ్చల్ డివిజన్ డీసీపీ ఎన్.కోటిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కెపీహెచ్‌బీకాలనీ, భవ్యా ఎన్‌క్లేవ్‌లో నివాసముంటున్న డాక్టర్ ఆర్.రవికుమార్‌కు మల్లంపేట్‌కు చెందిన రాకేష్ అనే వ్యక్తి మండల నరేష్‌ను బిల్డర్‌గా పరిచయం చేశాడు. మల్లంపేట్‌లోని కేవీఆర్ వ్యాలీలో ప్లాట్ నంబర్ 167 తన అక్క పూర్ణిమ దిగా నరేష్ చెప్పి గత సంవత్సరం నవంబరు 23న డాక్టర్ రవికుమార్, అతని భార్య ఆర్.ఆరుణ పేర్లపై ఏవీ రామరాజు అనే వ్యక్తి పేరుపై ఉన్న స్థలాన్ని తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి రిజిస్ట్రేషన్ చేశారు.

ప్రకాశం జిల్లా సంతనూతలపాడు, ఏనుగుపాడు గ్రామానికి చెందిన కోతి ఆంజనేయులు(42) మేస్త్రీ పనిచేస్తూ మల్లంపేట్ గణేష్‌నగర్‌కాలనీలో ఉంటున్నాడు. అతడిని ఏవీ రామరాజుగా చూపించి నకిలీ ఆధార్‌కార్డు ఇతర పత్రాలు సృష్టించి విక్రయించారు. విషయం తెలుసుకున్న డాక్టర్ రవికుమార్ పోలీసులకు గత సంవత్సరం డిసెంబరు 16న ఫిర్యాదు చేయడంతో దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. 2023లోనే మండల నరేష్ మరికొందరు వ్యక్తులు తప్పుడు పత్రాలు సృష్టించి విక్రయించినట్లు గుర్తించారు. తప్పుడు పత్రాలు సృష్టించి భూమి విక్రయించిన కోతి ఆంజనేయులును దుండిగల్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ముత్యాలమ్మ దేవాలయ నాలుగో వార్షికోత్సవం

పేట్‌బషీరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఏఎల్ రాఘవేంద్రకాలనీలోని ముత్యాలమ్మ దేవాలయం నాలుగో వార్షికోత్సవం నేడు జరగనున్నట్లు ఆలయ కమిటీ, అసోసియేషన్ సభ్యులు తెలిపారు. గురువారం ఉదయం 6 నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, 10.30 గంటలకు శివపార్వతుల కల్యాణం జరుగుతుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారి ఆశీస్సులు పొందగలరని కమిటీ సభ్యులు కోరారు.

వాహనదారులూ.. జర జాగ్రత్త

కుత్బుల్లాపూర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నం కార్యరూపం దాల్చడం లేదనిపిస్తోంది. కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయం చౌరస్తాలో సిగ్నళ్లు పడినప్పటికీ వాహనదారులు ఇష్టానుసారంగా వెళ్తూ ప్రమాదాలకు స్వాగతం పలుకుతున్నట్లు కనిపిస్తోంది. అజాగ్రత్తగా వెళ్లి ప్రాణాలను కోల్పోతున్నప్పటికీ ఒక నిమిషం కూడా ఆగకుండా సిగ్నళ్లను దాటుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. బుధవారం కుత్బుల్లాపూర్ సర్కిల్ చౌరస్తాలో జరిగిన వాస్తవ పరిస్థితులపై ఈ ఫోటోలు.


మహిళలను కూర్చోబెట్టుకుని రెడ్ సిగ్నల్ ఉండగా రోడ్డు దాటుతున్న యువకుడు


ఇష్టానుసారంగా వెళ్తున్న వాహనదారులు